www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

SIDDIPET POWER
TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి: 01 సంచిక: 28 హైదరాబాద్ గురువారం 17-04-2025 పేజీలు: 03 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## కృష్ణా జలాల్లో 74%వాడుకున్న ఏపీ

కృష్ణా నదీ జలాలకు సంబంధించిన కోటాలో ఆంధ్ర ప్రదేశ్ 74% నీళ్లను వాడుకున్నట్టు కేఆర్ఎంబీ ధ్రువీకరించిందని, కానీ, తెలంగాణ ప్రభుత్వం 24% నీటిని కూడా వాడుకోవడం లేదని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం మరోసారి బయటపడిందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇంతకాలం బీఆర్ఎస్ చేస్తున్న వాదనను కేఆర్ఎంబీ రుజువు చేసిందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హెచ్చరించిన తర్వాత కూడా ఏపీ 65 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నదని మండిపడ్డారు. ఏపీ జలదోపిడీపై



ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చేతకాని దద్దమ్మల్లా ఏపీ సీఎం చంద్రబాబు బూట్లు నాకుతున్నారా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాలలో విష ప్రయోగం ఘటన.. నిందితుడు అరెస్టు




2

# అబద్ధాలు ఆపి.. తాగునీరు ఇవ్వండి

నిర్లక్ష్యంతో కరువు తీసుకొచ్చిన కాంగ్రెస్ సర్కారు
నల్లాలతో ఇండ్లకు నీటి సరఫరా చేయని ప్రభుత్వం
బిందెలు, డ్రమ్ములతో రోడ్డెక్కుతున్న ప్రజానీకం
మిషన్ భగీరథ నిర్వహణలో రేవంత్ సర్కార్ విఫలం

**హైదరాబాద్, ఏప్రిల్ 16(సిద్దిపేట పవర్):**

తెలంగాణలో కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి దుస్థితి కనిపిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ కార్యక్రమంతో నల్లాల ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ పాలనలో బిందెలు, డ్రమ్ములతో జనం రోడ్డెక్కుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నిర్వహణ వైఫల్యంతో ప్రభుత్వం నల్లాల ద్వారా నీళ్లు సరఫరా చేయలేని దీనమైన పరిస్థితి ఎదుర్కొంటున్నదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లు సాగునీళ్ల కోసం రైతుల గోస.. ఇప్పుడు తాగునీళ్ల కోసం

మిగతా 2వ పేజీలో..






## స్థానికులకు 25% రిజర్వేషన్లు కల్పించాలి

02

## కర్ణాటక కాంగ్రెస్‌లో కులగణన చిచ్చు

సీఎం సామాజికవర్గానికి ప్రాధాన్యమిచ్చారని



2

## తెలంగాణలో ఎకోరేస్ ఎనర్జీ సంస్థ రూ.27వేల కోట్లు పెట్టుబడులు:



02

## స్మితా సబర్వాల్ పోస్టుపై చట్టప్రకారం ముందుకెళ్తాం

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టుఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు



2

## హైదరాబాద్‌లో స్వాధీనం

- అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తో పాటు విదేశీ మద్యం బాటిళ్లను తెలంగాణ ఎస్‌టీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు.



2



ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణం

తొలుత గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి
హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## ఐదుగంటలపాటు శ్రవణ్‌రావు విచారణ

02

## భారత్‌కు రానున్న జేడీ వాన్స్

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- భారత్ పర్యటన ఖరారైంది.



2

## రాజస్థాన్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం



2

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ నియామకం


సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ నియామకం
మే 14న బాధ్యతలు స్వీకరించనున్న గవాయ్
కేజీ బాలకృష్ణన్ తర్వాత రెండో దళితుడిగా రికార్డ్



2

## క్యాడ్‌బరీ జెమ్స్‌లా డోలో 650 వాడకం

- భారతీయుల తీరుపై డాక్టర్ వ్యాఖ్య.. వైరల్



2

www.siddipetpower.com
WWW.SIDDIPETPOWER.COM



## స్మితా సబర్వాల్ పోస్టుపై చట్ట ప్రకారం ముందుకెళ్తాం

**సిద్ధిపేట పవర్** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకో ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టే చెప్పిందన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.''నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. భూముల విషయం కోర్టుల పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేం. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం ముందుకు వెళ్తాం. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సర్వసాధారణం. భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నాం. రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ఈ భూములపై ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదు మాది'' అని శ్రీధర్‌బాబు అన్నారు.

# అబద్ధాలు ఆపి.. తాగునీరు ఇవ్వండి

**సిద్ధిపేట పవర్** తెలంగాణలో కాంగ్రెస్ 16 నెలల పాలనలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి దుస్థితి కనిపిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథ కార్యక్రమంతో నల్లాల ద్వారా ఇంటింటికి తాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ పాలనలో బిందెలు, డ్రమ్ములతో జనం రోడ్డెక్కుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నిర్వహణ వైఫల్యంతో ప్రభుత్వం నల్లాల ద్వారా నీళ్లు సరఫరా చేయలేని దీనమైన పరిస్థితి ఎదుర్కొంటున్నదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇన్నాళ్లు సాగునీళ్ల కోసం రైతుల గోస.. ఇప్పుడు తాగునీళ్ల కోసం ప్రజల ఘోష!, కాంగ్రెస్ పాలనలో తడారిన పొలాలు.. ఎడారయిపోతున్న ప్రజల బతుకులు. ముందుచూపు లేమి, నిర్లక్ష్యంతో ప్రాజెక్టుల్లో నీళ్లు ఒడిసి పట్టలేదు, చెరువులు నింపలేదు, భూగర్భ జలాలు పెంచలేదు. మిషన్ భగీరథ ద్వారా నీళ్లు సరఫరా చేయడంలేదు. కేసీఆర్ ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి, తాగునీళ్లిస్తే.. రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నప్పుడు.. ఉమ్మడి పాలన నాటి బిందెలు, డ్రమ్ములు మళ్లా రోడ్లపై కనిపిస్తున్నాయి. తెలంగాణ



ఆత్మగల్ల పాలకుడికి, తెలంగాణ ప్రయోజనాలు పట్టని పాపాత్ముడికి ఉన్న తేడా ఇది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువు. రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యం తెచ్చిన కరువు అని హరీశ్‌రావు నిప్పులుచెరిగారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అబద్ధాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇండ్లకు తాగునీటిని పారించాలని హితవు పలికారు.

## ఇచ్చోడ ప్రభుత్వ పాఠశాలలో విష ప్రయోగం ఘటన.. నిందితుడు అరెస్టు




**సిద్ధిపేట పవర్** ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. 329(4), 324(6), 331(8), 332 BNS సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం'' అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ నియామకం

**సిద్ధిపేట పవర్** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో తదుపరి చీఫ్ జస్టిస్‌గా గవాయ్ పేరును కొలీజియం ప్రతిపాదించింది. ఇక మే 14న భారత ప్రధాన న్యాయమూర్తిగా బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.జస్టిస్ గవాయ్ నవంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. దాదాపు ఆరు నెలల పాటు భారత ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించనున్నారు. 2007లో దేశంలోని అత్యున్నత న్యాయ పదవికి పదోన్నతి పొందిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టిన రెండవ దళితుడిగా గవాయ్ రికార్డ్ సృష్టిస్తున్నారు.బీఆర్. గవాయ్ పూర్తి పేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1985లో న్యాయవాదిగా బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో ప్రాక్టీస్ చేశారు. అనంతరం ప్రభుత్వ ప్లీడర్‌గా మహారాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. ఇక నవంబర్ 14, 2003న బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మే 24, 2019న సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందారు. దాదాపు బాంబే హైకోర్టులో 16 సంవత్సరాలు పని చేశారు.కేంద్ర న్యాయ శాఖ సూచనల మేరకు గవాయ్ పేరును కొలీజియం సిఫార్సు చేసింది. మే 14, 2025 నుంచి నవంబర్ 24, 2025 వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గవాయ్ పని చేయనున్నారు.



## ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణం


**సిద్ధిపేట పవర్** బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఆధ్వర్యంలో శాసనమండలి వేదికగా దాసోజు ప్రమాణం చేశారు. తొలుత గన్‌పార్కు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మల్లారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, భిక్షమయ్యగౌడ్, బాల్క సుమన్, నేతలు గజ్జెల నగేశ్, గెల్లు శ్రీనివాస్‌యాద్, ఆంజనేయగౌడ్, కిశోర్‌గౌడ్, జయసింహ, సుమిత్రానంద్, కుర్వ విజయ్, సతీశ్, శుభప్రద్ పటేల్, రంగినేని అభిలాశ్, నర్సిరెడ్డి, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి దాసోజుకు శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ నరసింహాచార్యులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. గత 18 ఏండ్లుగా రాజకీయ కార్యకర్తగానే ఉన్న తనకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి రాజకీయ పునర్జన్మ ప్రసాదించారని పేర్కొంటూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనను అంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎకోరేస్ ఎనర్జీ సంస్థ రూ.27వేల కోట్లు పెట్టుబడులు



**సిద్ధిపేట పవర్** తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీ రెడ్కో)తో ఎకోరేస్ ఎనర్జీ, జీపీఆర్‌ఎస్ ఆర్య సంస్థలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. రూ.27వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎకోరేస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 2వేల కోట్లతో 15 జిల్లాల్లో బయోగ్యాస్ ప్రాజెక్టులకు జీపీఆర్‌ఎస్ ఆర్య ఒప్పందం చేసుకుంది. అంతకుముందు బ్యాంకర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దని బ్యాంకర్లను కోరారు. మానవీయ దృష్టితో రూపొందించిన ఈ పథకానికి సహకరించాలన్నారు. రాజీవ్ యువ వికాసం.. రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుందన్నారు.''కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత పదేళ్లుగా నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే.. నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు సహకరించాలి. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తుంది.. బ్యాంకర్లు రూ. 1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలి'' అని కోరారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ వాటా విడుదల కాగానే.. బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేసేలా చూడాలన్నారు.

# భారత్‌కు రానున్న జేడీ వాన్స్



**సిద్ధిపేట పవర్** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్) భారత్ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి ఇటలీ, భారత్‌లను సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే.ఇటలీ, భారత్ పర్యటనల్లో భాగంగా ఆయా దేశాల నేతలతో వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటుంబం ఢిల్లీ, జైపూర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆయా చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననుంది. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ భేటీ కానున్నారు. భారత్ అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.

## స్థానికులకు 25% రిజర్వేషన్లు కల్పించాలి

**సిద్ధిపేట పవర్** విశ్వవిద్యాలయం ప్రవేశాల్లో స్థానిక విద్యార్థులకు 25% రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ దేవేశ్‌నిగమ్‌కు వినోద్‌కుమార్ బృందం వినతిపత్రం అందజేసింది. తెలంగాణ విద్యా అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 371ఈ కింద స్థాపించిన ఏకైక కేంద్ర విశ్వవిద్యాలయం హెచ్‌సీయూ అని గుర్తుచేశారు. 1969లో తెలంగాణ తొలి ఉద్యమం తర్వాత ఆరు సూత్రాల పథకంలోని ఆర్టికల్స్ 371డీ, 371ఈలను రాజ్యాంగంలో చేర్చినట్టు తెలిపారు. తొలిదశ ఉద్యమంలో 360 మంది విద్యార్థులు, యువత ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీల్లో ఇప్పటికే స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్లు అమలవుతున్నాయయని, ఇక్కడ కూడా అమలు చేసేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టంచేశారు. రాష్ట్ర సామాజికవిద్యా వాస్తవాలను గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వినోద్‌కుమార్ వెంట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, విద్యార్థి నాయకుడు విశాల్, హెచ్‌సీయూ ఇన్‌చార్జి అభినేశ్, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ కిరణ్‌కుమార్, మురళీయాదవ్ ఉన్నారు.



## కర్ణాటక కాంగ్రెస్‌లో కులగణన చిచ్చు

**సిద్ధిపేట పవర్** కర్ణాటక కాంగ్రెస్‌లో కులగణన నివేదిక చిచ్చురేపింది. నివేదికపై పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం సిద్ధరామయ్య సామాజిక వర్గం కురుబలకు అనుచిత ప్రాధాన్యం కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీలోని లింగాయత్, వొక్కలిగ నేతలు ఈ నివేదికను వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో 17న మంత్రివర్గంలింగాయత్, వొక్కలిగ నేతల్లో ఆందోళనకుల గణనకు సంబంధించిన నివేదికను ఈ నెల 11న రాష్ట్ర మంత్రివర్గం ముందు ఉంచారు. ఆ నివేదిక ప్రకారం ప్రస్తుత అంచనా కన్నా 38 శాతం అధికంగా రాష్ట్రంలో ఓబీసీల సంఖ్య 69.6 శాతం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో వొక్కలిగలు, లింగాయత్‌లు 3ఏ, 3బీ క్యాటగిరీల కింద ఓబీసీ రిజర్వేషన్లు 12.2 శాతం, 13.6 శాతం అనుభవిస్తున్నారు. జనాభా పరంగా వీరి సంఖ్య 17 శాతం, 15 శాతం ఉండవచ్చునని అంచనా కాగా, అంతకన్నా తక్కువగా వీరి సంఖ్య నమోదైంది. అయితే ప్రస్తుత కుల సర్వే 4 శాతం పాయింట్లను పెంచుతూ వీరిని 2బీ క్యాటగిరీ కింద ఉంచాలని సిఫార్సు చేసింది. దీంతో వొక్కలిగ, లింగాయత్‌లకు రిజర్వేషన్లలో మూడు శాతం పెరిగి స్వల్ప ప్రయోజనం ఏర్పడనుంది. అయితే ఓబీసీ వర్గాల కోటా పెంచుతూ నివేదిక సిఫార్సు చేయడం.. ఇంతకాలం రాజకీయాల్లో పూర్తి ఆధిపత్యం వహిస్తూ వచ్చిన వొక్కలిగ, లింగాయత్ వర్గాల్లో ఆందోళనకు దారి తీసింది. ఊహించిన దాని కన్నా అత్యధికంగా ఉన్న ఓబీసీలకు కోటా పెంపు వల్ల జనాభా ప్రాతిపదికన మిగిలిన వర్గాలకు సీట్ల కేటాయింపు పెరుగుతుందని, తద్వారా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల టికెట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని ఆ వర్గం నేతలు ఆందోళన చెందుతున్నారు.

వొక్కలిగ నేతలతో డీకే భేటీ

తాజా పరిణామాలతో కాంగ్రెస్‌లో వొక్కలిగల ఆధిపత్యం ఏమాత్రం తగ్గకూడదని ఆ వర్గానికే చెందిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన ఆ వర్గ ఎమ్మెల్యేలు, నేతలతో రహస్య సమావేశం నిర్వహించారు. కాగా, కుల సర్వే అంతా ఫార్సుగా బీజేపీ కొట్టిపారేసింది. ఇది మైనారిటీలను బుజ్జగించడానికి కాంగ్రెస్ చేసిన సర్వే అని, అందులోని అంకెలన్నీ సీఎం సిద్ధరామయ్య చెప్పినవేనని బీజేపీ నేత ఆర్ అశోక ఆరోపించారు. సమావేశమై కులగణన నివేదికపై చర్చించనుంది.

## క్యాడ్‌బరీ జెమ్స్‌లా డోలో 650 వాడకం

**సిద్ధిపేట పవర్** భారతీయులు డోలో 650 మాత్రలను క్యాడ్‌బరీ జెమ్స్‌లా తినేస్తున్నారని గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హెల్త్ ఎడ్యుకేటర్ పలనియప్పన్ మానిక్కం సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యానించారు. ఇది వైరల్‌గా మారింది. తమ ఇంటిలోనూ ఇదే పరిస్థితి అని చాలా మంది కామెంట్లు పెట్టారు. కొవిడ్19 మహమ్మారి వచ్చినప్పటి నుంచి ఈ మాత్రల వాడకం పెరిగింది. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు తగ్గడానికి వైద్యులు దీనిని సూచిస్తారు. అయితే ఇందులోని పారాసిటమాల్‌తో కిడ్నీ, కాలేయం దెబ్బతింటాయి.

## అమెరికాలో పండించే డ్రగ్స్.. హైదరాబాద్‌లో స్వాధీనం

**సిద్ధిపేట పవర్** అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తో పాటు విదేశీ మద్యం బాటిళ్లను తెలంగాణ ఎస్‌టీఎఫ్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి చెప్పారు. స్కోడా కారు, గంజాయి, సింథటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

## ఐదుగంటలపాటు శ్రవణ్‌రావు విచారణ

**సిద్ధిపేట పవర్** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఓ మీడియా సంస్థ యజమాని శ్రవణ్‌రావును సిట్ అధికారులు ఐదుగంటలపాటు విచారించారు. బుధవారం జూబ్లీహిల్స్ పోలీసుస్టేషనలో ఈ విచారణ కొనసాగింది. ఈ కేసులో ఇప్పటికే శ్రవణ్‌రావును సిట్ అధికారులు మూడుసార్లు విచారించారు.

## సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం




**సిద్ధిపేట పవర్** రాజస్థాన్ రాయల్స్‌తో సూపర్ ఓవర్‌కు దారి తీసిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 188 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ టై అయి.. సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో తొలుత రాజస్థాన్ 2 వికెట్లు కోల్పోయి 11 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 4 బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించిన మిచెల్ స్టార్క్‌కు ప్లేయర్ ఆఫ్ ది అవార్డు వచ్చింది. ఢిల్లీకి ఇది ఐదో విజయం కాగా.. రాజస్థాన్‌కు ఇది ఐదో ఓటమి.




## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**సిద్దిపేట పవర్**బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఏ పార్టీలేని విధంగా బీఆర్ఎస్‌లోనే పార్టీ కార్యకర్తలకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. 33 డివిజన్‌కు చెందిన పసునూరి వీరయ్య ప్రమాదవశాత్తు మరణించగా మరణించగా పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల విలువైన చెక్కును పెరుకవాడలోని క్యాంపు కార్యాలయంలో బాధితకుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి కొత్త శకానికి నాంది పలికింది

**సిద్దిపేట పవర్**సంఇవాల్టి ప్రత్యేక ఘట్టంగా సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించటంను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. 136 ఏళ్లకు పైగా తెలంగాణ సింగరేణి తన బొగ్గు తవ్వకాలను నిర్వహించి రాష్ట్రానికి వెలుగులు పంచుతుంటే, ఇప్పుడు ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్లో తవ్వకాలు ప్రారంభించడం ద్వారా సింగరేణి సంస్థ భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేస్తుంది అని ఆయన చెప్పారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదిక పోస్ట్ చేశారు. ప్రజా ప్రభుత్వ తీసుకున్న ప్రత్యేక చొరవ ద్వారా సింగరేణి సంస్థ మొదటిసారిగా దేశంలోని ఇతర రాష్ట్రంలో బొగ్గు గనిని ప్రారంభించడాన్ని సాధ్యం చేసినట్లు పేర్కొన్నారు. ఇది తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని, ఒడిశాలోని అంగుల్ జిల్లాలో నైనీ గని ప్రారంభించడం సింగరేణి సంస్థ కొత్త శకానికి నాంది పలుకుతుందని అన్నారు.నైనీ బొగ్గు గనికి అన్ని అనుమతులు పొందడం, తద్వారా తవ్వకాలు ప్రారంభించడమ అనేది తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇది సింగరేణి సంస్థ చరిత్రలో ఒక చారిత్రక ఘట్టంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



సింగరేణి సంస్థ, తెలంగాణ రాష్ట్రానికి మణిమకుటగా, వెంకలవెయ్యి కార్మిక కుటుంబాలకు జీవనాధారం ఇచ్చే సంస్థగా నిలుస్తూ, వృద్ధి, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నది అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేస్తూ, రాష్ట్రంలో ఈ విధమైన అనేక ప్రాజెక్టులకు ప్రముఖ మద్దతు అందజేస్తామని ఆయన తెలిపారు.



## యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం..

- **ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య భద్రతపై అవగాహన**

**సిద్దిపేట పవర్**సం పూర్ణమైన ఆరోగ్య జీవితానికి ప్రతీ ఒక్కరూ యోగాసనాలు పాటించాలని వర్గల్ మండలం జెబ్బాపూర్ మహిళా సమైఖ్య సంఘం కోఆర్డినేటర్ నర్సింలు తెలిపారు. ఇవాళ జెబ్బాపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మహిళలు పొదుపుతోపాటు, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని నర్సింలు సూచించారు. ఎంత డబ్బు ఉన్నా, అనారోగ్యంతో బాధపడటం నరకంతో సమానమన్నారు. ఉపాధి హామీ కూలీలు సరైన ఆహారం తీసుకుంటూనే రోజూ 10 నుండి 20 నిమిషాలపాటు వీలు చేసుకొని యోగా చేసుకోవాలని సూచనలు చేశారు.యోగా ద్వారా మానసిక వత్తిడి తగ్గడమేకాకుండా, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళాగ్రూపు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



## తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సముద్రాల అజయ్


**సిద్దిపేట పవర్**లంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన సముద్రాల అజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు . 2018 నుంచి జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న సముద్రాల అజయ్ సంఘాన్ని బలోపేతం చేయడానికి చేసిన కృషిని గుర్తించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదోన్నకాగా, తన మీద నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గజ్జల కాంతంకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.తి కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.



## సిద్ధి వినాయక ఆలయం వరకు నామా రవి కిరణ్ పాదయాత్ర

**సిద్దిపేట పవర్**ఈనెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతం కావాలని కోరుతూ జహీరాబాద్ మాజీ కౌన్సిలర్, సీనియర్ నేత నామ రవి కిరణ్ ఆధ్వర్యంలో న్యాల్కల్ మండలం రేజింతల్ సిద్ధి వినాయక ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. బుధవారం సంకష్టహర చతుర్ధిని పురస్కరించుకొని తెల్లవారుజామున జహీరాబాద్ పట్టణంలోని భవాని మందిర్ ఆలయం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేజింతల్ సిద్ధి వినాయక ఆలయానికి పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి ఆలయానికి చేరుకున్నారు.ఆలయానికి చేరుకున్న అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఎలాంటి ఆటంకాలు కలవకుండా బీఆర్ఎస్ రజతోత్సవ సభ దిగ్విజయం అయ్యేలా కరుణించాలని కోరుతూ స్వామివారిని మొక్కుకున్నట్లు బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ నామరవి కిరణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోడువారుతున్న అవెన్యూ ప్లాంటేషన్లు..



**సిద్దిపేట పవర్**సీమాంధ్రుల పాలనలో పాలకుల విచ్చలవిడి విధానంతో అటవీ సంపద తగ్గింది. కాలుష్య కారకాలు పెట్రేగి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగింది. స్వరాష్ట్ర కల సాకారమైన అనంతరం కేసీఆర్ కాలుష్యాన్ని అరికట్టి ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రకటించి, అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాలనా పగ్గాలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి, హరిత ఉద్యమానికి నాంది పలికారు. ప్రతి ఏటా జులై నెల నుంచి అక్టోబర్ వరకు ప్రజలు, అధికారులకు లక్ష్యం విధించి మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నారు.

## దుగ్గొండిలో గాలివాన బీభత్సం..





**సిద్దిపేట పవర్**గ్గొండి మండలంలో మంగళవారం రాత్రి భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. పీజీ తండా గ్రామంలో గాలివాన కారణంగా గ్రామానికి చెందిన నునవత్ రాజు నాయక్, శంకర్, రాజుకుమార్, శ్రీనివాస్, రాకేష్‌తో పాటు పలువురి ఇంటి పైకప్పు రేకులపై రేకులు ఎగిరిపోయాయి. ఇండ్లపై చెట్లు విరిగిడటంతో పలువురు నిరాశ్రయులయ్యారు.వర్షం కారణంగా మొక్కజొన్న, అరటి, బొప్పాయి, వరి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. కల్లాల వద్ద ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం, వరి ధాన్యం వర్షానికి తడవడం వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. నాచినపల్లి రామాలయం వద్ద 40 అడుగుల ధ్వజస్తంభం నేలకొరిగింది. పంట నష్టం పై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు, బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలని పలువురు రైతులు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

## అగ్నిప్రమాదాలపై నిర్లక్ష్యం వహించొద్దు..

**అగ్నిమాపక వారోత్సవాల్లో సిబ్బంది**

**సిద్దిపేట పవర్**అ గ్నిప్రమాదాలపై ఎలాంటి నిర్లక్ష్యం చూపించొద్దని అగ్నిమాపక శకట సిబ్బంది ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇవాళ రామాయంపేట పట్టణంలోని పలు వార్డుల్లో అగ్ని ప్రమాదాలపై తీసుకునే చర్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.అగ్ని ప్రమాదాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. తమకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తే వెంటనే నిమిషాల్లో మీ ముందు ఉంటామని సిబ్బంది పేర్కొన్నారు. పట్టణంలోని తమ ఇండ్లలోగానీ, ఇతర ప్రాంతాల్లో సైతం ఎక్కడా అగ్ని ప్రమాదం సంభవించినా తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయో వాటిని నివారించే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు ప్రభుత్వం అగ్ని



మాపక వారోత్సవాలను నిర్వహించ తలపెట్టిందని వారం రోజుల్లో తమ పరిధిలో ఉన్న గ్రామాలన్నింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తామని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌మెన్‌లు చంద్రాగౌడ్, ప్రవీణ్, సత్య, నర్సగౌడ్, శంకర్ తదితరులు ఉన్నారు.

# సిద్ధమవుతున్న రజతోత్సవ వేదిక

**సిద్దిపేట పవర్**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. భారీ బహిరంగ సభల నిర్వహణలో రికార్డులున్న బీఆర్ఎస్.. ఎల్కతుర్తి సభను అదే స్థాయిలో నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నది. లక్షలాది మంది ప్రజలు, తెలంగాణవాదులు, బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు హాజరయ్యే రజతోత్సవ మహాసభ వేదిక నిర్మాణం మొదలైంది. 120 ఫీట్ల పొడవు, 80 ఫీట్ల వెడల్పుతో వేదిక ఏర్పాటవుతున్నది. వేదిక నిర్మాణం కోసం కంకర పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 50 వేల వాహనాల్లో లక్షలాది మంది ఈ సభకు వస్తారనే అంచనా ఉండటంతో అందుకు అనుగుణంగా 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 154 ఎకరాల్లో సభా ప్రాంగణం, 1,059 ఎకరాల్లో పార్కింగ్ వసతులు ఏర్పాటు చేస్తున్నారు.మహాసభ ప్రాంగణం మొత్తం చదును చేశారు. సిద్దిపేట, వరంగల్, కరీంనగర్ నుంచి జాతీయ రహదారి జంక్షన్‌గా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు అనువుగా ఉన్నది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అనుసంధానమయ్యేలా ఎల్కతుర్తి నుంచి జాతీయ రహదారులు ఉన్నాయి. రజతోత్సవ సభ ఏర్పాట్లతో ఎల్కతుర్తి కొత్త కళను సంతరించుకున్నది. నెల రోజుల్లోనే గుర్తుపట్టలేనంతగా ఎల్కతుర్తిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అభివృద్ధి అయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, సూచనలతో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు ఆధ్వర్యంలో మహాసభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.



**భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా సభ...**

తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన బీఆర్ఎస్ 25 ఏండ్ల ఉద్యమ, అభివృద్ధి, రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూనే... రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై భరోసానిచ్చేలా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఉంటుందని గులాబీ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ, ముఖ్యంగా రైతులు, పేదలు ఆర్థికంగా సాధికారత వైపుగా అడుగులు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ఏడాదిన్నరగా సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో రాష్ట్ర పురోగతి మందగించింది. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఆగమవుతున్నది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాలకు అండగా నిలిచేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉంటుందని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన బీఆర్ఎస్ అలుపెరుగని ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన విషయం విదితమే. 2014 నుంచి పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణను బీఆర్ఎస్ దేశంలో అగ్రగామిగా నిలిపింది. రాష్ట్ర సాధన ఉద్యమం, 10 ఏండ్ల సుపరిపాలన కలయికగా ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ జరగనున్నది.

## సహకార సంఘం సిబ్బందిపై రైతులు సీరియస్..

**సిద్దిపేట పవర్** మండలంలోని ఎత్తుండా సహకార సంఘం సిబ్బందిపై రైతులు సీరియస్ అయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో సహకార సంఘం సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కాంటలు చేయకుండా ఇష్టం వచ్చినట్లు కాంటాలు చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. మొదట వడ్లను ఎండబెట్టిన రైతుల కంటే తర్వాత వచ్చిన రైతుల వడ్లను కాంటా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. చిన్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం కార్యాలయ గేట్‌కు రైతులు తాళం వేసి ఆందోళనకు దిగారు. తాళం వేసిన గేటు ఎదుట రైతులు నిరసన తెలిపారు. పితుండ సహకార సంఘంలో కొనుగోలు కేంద్రాల్లో కేవలం రెండు కాంటాలే కొనసాగుతున్నాయని మరో ఆరు కాంటలు అదనంగా అవసరం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా లారీల కొరత తీవ్రంగా ఉందని, రైతుల సమస్య ఎవరు కూడా పట్టించుకోవడంలేదన్నారు. వడ్లు ఆరాబోసి వారం రోజులు గడుస్తున్న హమాలీలు లేకపోవడం వల్ల కాంటాలు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గేటు ఎదుట మండు టెండలోనే నిరసన తెలిపారు. ఈ విషయంపై తహసిల్దార్ గంగాధర్ తక్షణమే స్పందించి సహకార సంఘం వద్దకు చేరుకున్నారు. సంఘటనకు సంబంధించి సమస్యలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖ వారితో మాట్లాడి లారీల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు శాంతించారు.

